
# తప్పెవరిది?

— సుమన బిశోయి

"ఏట్రా అప్పలసూరి? బాగున్నావా?" హుషారుగా అడుగుతున్న పైడి రాజుని తలపైకెత్తి చూస్తూ, చేతిలో గొడ్డలిని కిందపెట్టి, సంతోషంగా, "అరె! నువ్వెప్పుడొచ్చావ్? మనిషివి గట్టి పడ్డట్టున్నావే! పొట్టిగా కనిపిస్తున్నావ్!" అన్నాడు సూరి.



కురచగా జుట్టు కత్తిరించుకొని, కొత్త ప్యాంటూ, షర్ట్ టక్ చేసుకొని, కాళ్లకు బూట్లతో నిల్చొని ఉన్న పైడి రాజు ముఖంలో రవ్వంత గర్వం, ఆనందంతో మిళితమై కనిపిస్తోంది.

"ట్రైనింగ్‌లో అంతా ఇలాగే అయిపోతారు! రన్నింగ్, పీటీ రోజూ చేస్తాం గదా? కష్టమైతే ఉంది గానీ, మొత్తానికి బాగుందిలే" చెప్పాడు పైడిరాజు.

"ఎప్పుడొచ్చావ్? సెలవిచ్చారా? ఎన్ని రోజులు ఉంటావ్?" కుతూహలంగా ప్రశ్నల పరంపర సంధించాడు అప్పల సూరి.

"పండక్కి మూడు రోజులు పర్మిషను దొరికింది. అస్సలు నాకు...." అటుగా వస్తున్న నాయుడిని చూసి, చెప్పడం ఆపి, రెండడుగులు వేసి ఎదురెళ్ళాడు.

"ఏట్రోయ్ అల్లుడా! అప్పుడే పోలీసువై పోయినట్టు గున్నావ్? ఏటి సంగతులు?" అంటూ భుజం మీద చెయ్యేసి తనతో పాటే నడిపించు కెళ్లాడు నాయుడు. పైడి రాజు తిరిగి చూడకుండానే వెళ్లిపోయాడు.

అటే చూస్తున్న అప్పల సూరి ముఖమంతా నిరాశ, నిస్పృహలు ఆవరించాయి. మనసంతా భారమై పోయింది. తలదించి ఎదురుగా కనిపిస్తున్న తుమ్మ మొద్దును పరికిస్తూ, చేతిలో గొడ్డలిని అసంకల్పితంగా పైకెత్తి మొద్దుపైకి విసిరాడు. మెదడు సహకరించని చేతిలో గొడ్డలి, ఆ ఊపులో పోయి తుమ్మ మొద్దుకి

ప్రక్కగా తగిలేసరికి, ఆ బరువుకి ఒళ్లు తూలి పడగా, గొడ్డలి పట్టుకున్న కుడిచేయి జబ్బలో "కరేల్" మంటూ నొప్పి సుళ్లు తిరిగింది! "అమ్మా" అంటూ గొడ్డలిని విడిచిపెట్టి, ఎడమ చేత్తో కుడి చేతి భుజాన్ని పట్టుకొని, కండరాల్లోని బాధని పళ్ల మధ్య బిగించి కళ్లు మూసుకుంటూ ఎగదన్నుకొస్తున్న ఏడుపుని దిగమింగే ప్రయత్నం చేస్తున్నాడు అప్పల సూరి! అంతటి నొప్పికి మూలకారణమైన పోలీసుల ట్రీట్‌మెంటు, కోర్టు, బెయిలు, గతి తప్పిన తన జీవితం - అన్నీ కళ్ల ముందు బుట్ట బొమ్మల్లా కదుల్తూ నాట్యం చేశాయి.

❖ ❖ ❖

ఎంతో కష్టపడి తమ గ్రామం దగ్గర్లోగల మైదానం చుట్టూ పరుగెడుతూ, ఎదురుగా ఉన్న కొండపైకి ఎక్కి, దిగి, నానా తిప్పలూ పడీ, పోలీస్ పెరేడు గ్రౌండ్లో అందరికన్నా ఎక్కువగా శ్రమపడి, సెలక్షన్లో మార్కులు తెచ్చుకున్నాడు! "కానిస్టేబుల్ ఉద్యోగం గ్యారంటీ" అని అందరితో అనిపించుకుంటూ, ఊళ్లోకి వచ్చాడు తను! ఆ రోజుల్లోనే గ్రామంలోకి వచ్చి కలెక్టరు గారు ప్రకటించిన 'అక్షర దీపిక''లో వలంటీరుగా చేరి, రాత్రిబడి తమ వీధిలో నడుపుతూ, తన కోసం రాబోయే పోలీసు వెరిఫికేషనుకై పగలంతా ఎదురుచూస్తూ గడుపుతున్నాడు. కూలీనాలీ చేసి ముగ్గురు పిల్లల్ని పోషిస్తున్న తల్లి తండ్రులకు ఎప్పుడెప్పుడు సాయపడ్తానా అని ఉవ్విళ్లూరుతున్న అప్పల సూరి తన జీవితం అంత భయంకర ప్రమాదానికి లోనవుతుందని కనీసం ఊహించలేక పోయాడు! తమ వీధిలోని సాటి మనుషులు భుక్తి కోసం ఆశపడి చేస్తున్న పని తనకు నచ్చకపోయినా, నివారించే వయసు, పెద్దరికం లేక మిన్నకుండి పోయాడు.

ఆ కాళరాత్రి, కిరోసిన్ దీపాల వెలుతురులో అక్షరాలు దిద్దిస్తున్న అప్పల సూరికి అకస్మాత్తుగా అరుపులు, కేకలు వినిపించాయి! "ఎక్సైజోళ్లు, పోలీసోళ్లు వొస్తున్నారు! దాచేయండి! పారిపొండి!" అంటూ అప్పలకొండ గాభరాగా అరుస్తూ వీధిలోకి పరుగెత్తుకు రావడం చూశాడు. విషయం అర్థమయ్యేలోగా, తమ ముందున్న పలకా బలపాలు, పుస్తకాలను అలానే వదిలేసి, ఆడాళ్లు, పిల్లలు గోలగా అరుచుకుంటూ ఇళ్లలోకి పారిపోయారు!

"లోపుల్లోటి బట్టీలు పగల గొట్టేశారు" అంటూ మరొకరెవ్వరో పరుగెత్తారు.

"ఆళ్లని రానీండి! కళ్లలో కారం జల్లి దుడ్డు కర్రతో బాదుతాను" వీరనారి ఎవరో గట్టిగా ప్రకటించింది! 'ఔనౌను, అదే సెయ్యాల... బుద్దొస్తాది.. ఒదిలి పెట్టొద్దు' తీర్మానాలు వెంట వెంటనే వినిపిస్తున్నాయి! క్షణాల్లో రణరంగంలా మారిపోయిందా వీధి!! భయమనిపించి అప్పలసూరి తన ఇంట్లోకి పరుగు దీశాడు!

తాటి తోపుల్లోంచి పరుగెత్తుతూ వచ్చిన ఎక్సైజు పోలీసులు కనిపించిన ఇళ్లలోకి చొరబడ్డారు! సారా కుండల్ని పగులకొడుతూ లోపలకు వెళ్తున్న వారి కళ్లల్లో ఊహించని మెరుపులు మెరిశాయి! "మంట... మంట..." అని అరుచుకుంటూ అక్కడ నుంచి బయట పడేందుకు ప్రయత్నిస్తున్న వారి వీపులపై కర్రలతో మోదుతున్నారు ఇళ్లలోని ఆడవారు!! ప్రాణాలు దక్కించుకొనేందుకు తమ జీపులున్న దిశగా పరుగెడుతున్న వారిపై రాళ్ల వర్షం పడుతోంది! అంతా రణ రంగాన్ని తలపింపజేస్తోంది!

భయంతో బిక్క చచ్చిపోయిన అప్పలసూరి లాంటి వాళ్లు కొంతమంది ఆ రాత్రంతా బితుకు బితుకు మంటూ గడిపారు.

తెలవారుతూనే పోలీసుల దిగ్బంధంలో చిక్కుకున్నారు ఆ వీధి వాళ్లంతా! సారా కాచడం, అమ్మడం నేరం! ఆపై దాన్ని అదుపు చేసేందుకు వచ్చిన ప్రభుత్వ సిబ్బందిని అమానుషంగా కొట్టి హింసించడం మహా నేరం! అందుకు ప్రతిఫలం - నిర్దాక్షిణ్యంగా మీద పడుతున్న లాఠీలు, బూటు కాళ్లతో చెప్పుకోలేని చోట పడుతున్న తన్నులు, ఏడ్పులు, పెడబొబ్బలు! ఆడా, మగా, పిల్లా పీచుకా తేడాల్లేకుండా, అంతా పోలీస్ ట్రీట్‌మెంటు పొంది జైలు కెళ్లారు!

అప్పలసూరి రోదన అరణ్య రోదనే అయింది! ఊళ్లోని పెద్దల సిఫారసులు బుట్ట దాఖలయ్యాయి! జరిగిన అనర్థానికి ఫలితం అందరితో సమానంగా తనకీ అనుభవించక తప్పలేదు. అప్పటికే జరగవలసిన ఘోరం జరిగి పోయింది! వెరిఫికేషన్ పూర్తయ్యి, అప్పలసూరి ప్రవర్తన వ్యక్తిత్వంపై చెరిగిపోని మచ్చ పడనే పడింది! ఆశగా ఎదురుచూస్తున్న "పోలీసు ఉద్యోగం" అందని పండై పోయింది! పోలీసుల లాఠీ దెబ్బలకు కుడి భుజం చాలా రోజులు పని చెయ్యడం మానేసింది. పసర్లు, మూలికలతో ఇప్పుడిప్పుడే దారికొచ్చిన చేత్తో, తన వాళ్లందరి లాగే అప్పలసూరి కూడా రోజు కూలీగా మారి, తల్లి తండ్రులకు సాయపడుతున్నాడు! తన జీవితం తన ప్రమేయం లేకుండానే గుడ్డిదై పోయింది! చీకట్లో ఏమీ కనిపించక దుఃఖం పెల్లుబికి రాగా, బలవంతాన దిగమింగుతూ గతంలోంచి వర్తమానంలోకి వచ్చే ప్రయత్నం చేస్తూ, చేతిలోకి మళ్లీ గొడ్డలి తీసుకున్నాడు అప్పలసూరి.

ఎదురుగా పడి ఉన్న తుమ్మమొద్దును మసకబారిన కళ్లతో చూశాడు. 'ఈ రోజుకు దొరికిన కూలీ కర్రలు కొట్టడం' - వెంకటపతి రాజుగారి దయ! 'తనేం తప్పు చేశాడు... పైడి రాజు కంటే ఎందులో తీసిపోయాడు... తన బ్రతుకింతేనా...' జవాబు లేని ప్రశ్నలు మెదడుని తొలిచేస్తుంటే, అలా ప్రతిమలా నిల్చుండి పోయాడు.

ఇంట్లోంచి అంతా గమనిస్తున్న రాజు గారి అబ్బాయి 'వర్మ' సూరికి దగ్గరగా వచ్చి "ఏట్రోయ్! పైడి రాజుని చూశాక ఈస్టుమన్‌కలర్ సినిమా కనిపిస్తున్నాదేటి? నిల్చునే పోలీసువై పోయినట్టు కలగనేస్తున్నావు గావాల! నీ బతుక్కి అదొక్కటే తక్కువగానీ... బేగి కర్రలు కొట్టు. నాన్నొచ్చే టైమైంది..." వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు.

ఆ వ్యంగ్యోక్తి ఎదురుగా ఉన్న కొండను ఢీకొట్టి, గొప్ప ప్రతిధ్వనితో తిరిగొచ్చి తన తలను చీల్చుకొంటూ వెళ్లినట్లు అనిపించింది సూరికి!!

చివాలున తల త్రిప్పి వర్మకేసి చూశాడు అప్పలసూరి! అసంకల్పితంగా అతడి చేతులు గొడ్డలి చుట్టూ బిగుసుకొన్నాయి.

మరుక్షణం అప్పలసూరి రెండు చేతుల్తో గొడ్డలిని పైకిలేపి వర్మ తలపై బలంగా ఒక వేటు వేశాడు!! అంతే!! 'ఫట్' మంటూ పగిలిన తలతో దబ్బున క్రింద పడ్డ వర్మను కళ్లు విప్పార్చి చూస్తూ, చిన్నగా నవ్వుకున్నాడు అప్పలసూరి!!!

